# "వాన వెలిసింది"

రచన: మల్లాది రుక్మిణి

*[ఎవరో ఊహాసుందర వ్యక్తిగురించి కలలుకంటూ లేని దుఃఖాలు కొనితెచ్చుకునే వారు కొందరు. ఏనాడో జీవితంలో తారసిల్లిన వ్యక్తి గురించి బాధపడుతూ ఎదుటివాళ్ల ఔన్నత్యాన్ని గ్రహించక అశాంతితో కుమిలిపోయేవారు మరికొందరు. అయితే ఆ పూర్వపు వ్యక్తికీ, యిప్పటి వ్యక్తికీ గల తారతమ్యాన్ని గ్రహించగలిగినప్పుడు— చేరువనున్న నిధిని గుర్తించలేదన్న సత్యము స్పష్టమవుతుంది. మబ్బులు నిండిన జీవితాకాశంలో మబ్బులు తొలగి వర్షం వెలిసి — జీవితం మబ్బుల్లేని పౌర్ణమి రాత్రి అవుతుంది ]*

మేడమీద బాల్కనీలో నుంచుని దూరంగా కనుపిస్తున్న సముద్రంకేసి చూస్తున్నది 'సుజాత'. ఉవ్వెత్తుగా పొంగుతున్న అలలు, తన ఆలోచనలకు వంత పాడుతూ, తనని రెచ్చగొడుతున్నాయా అని అనిపిస్తోంది.

ఆమె ముఖంలో, గత కొన్ని నెలలుగా, పీడిస్తున్న వ్యాధితాలూకు అనారోగ్యపు ఛాయలు ఇంకా తొంగిచూస్తూనే వున్నవి. ఆకాశంలో మబ్బులు పందెవేసుకుని పరుగెడుతూన్నాయి. ఇప్పుడో, ఇంకా సేపటికో అన్నట్లు మేఘాచ్ఛాదితమైన ఆకాశం వర్షించేట్లుగా ఉన్నది.

మేడ మెట్లమీద చప్పుడయింది. అవును. ఇది నిశ్చయంగా తనభర్త బూట్లచప్పుడే ఎన్నేళ్ళుగానో పరిచితమైన శబ్దం అది. ఉలిక్కిపడి, వెనక్కి తిరిగింది. తనని హెచ్చరించటానికి పైకి వస్తున్నారు కాబోలు.

ఆలోచనలోంచి తేరుకోకముందే భర్త వచ్చి 'ఏమిటి సుజా, అసలే సుస్తీమనిషివి. మఫ్లర్ వినా కట్టుకోకుండా ఇంత చలి గాలిలో నుంచున్నావూ, ఈగాలి నీ వంటి కేమాత్రం మంచిదికాదని నీకు తెలీదా, ఛే, ఛే, లోపలికివచ్చి కూర్చో నాకీరోజు క్లబ్బులో ఏదో ఫంక్షన్ వుంది. రావటం బహుశః ఆలస్యం అవవచ్చు నాకోసం కనిపెట్టుకోవద్దు' అని హెచ్చరించి వెళ్ళిపోయాడు. ఈ రకమైన మందలింపులు తనని ఎన్నిసార్లు చేయలేదు! తనే లక్ష్యపెట్టటం మానేసింది కానీ.

దగ్గరగావున్న కాన్వెంట్‌లో గంటకొట్టారు. బడి విడిచిపెట్టినట్లున్నారు. పిల్లలందరూ గుంపులు గుంపులుగా బయటికి వస్తున్నారు. వర్షపుజల్లు నెమ్మదిగా ప్రారంభించి క్రమక్రమంగా పెద్దదయింది. కొందరు పిల్లలు వర్షాన్ని లెక్కచేయకుండా పరుగెడుతున్నారు. మరికొందరు చిన్నపిల్లలు ఏడుస్తూ వర్షానికి తడిసి, దగ్గరలోఉన్న ఇళ్ళల్లోకి పరుగెడుతున్నారు. తనని ఆకర్షించిన దృశ్యమల్లా ఒక ఎనిమిదేళ్ళ అమ్మాయీ, పదిఏళ్ళ అబ్బాయీ ఆ వర్షంలో పుస్తకాలసంచి నెత్తినపెట్టుకుని, ఒకరిచేయి ఒకరు విడువకుండా గట్టిగా పుచ్చుకుని పొలాలవెంట మధ్య మధ్య వస్తున్న పిల్ల కాలువలని దాటుకుంటూ పరుగెడుతున్నారు. తనకు కనపడినంతవరకూ వారిని చూస్తూనే ఉంది. కనుమరుగైన తర్వాత తనదృష్టి తిప్పుకుంది. పాపం ఈరోజువాళ్లు పూర్తిగా తడిసిపోతారు కాబోలు! వాళ్లని చూస్తుంటే తన చిన్ననాటి జీవితం చక్రంలా కళ్లముందు గిర్రున తిరిగినట్లయింది. తన ఆలోచనలు ఇరవైఏళ్లు వెనక్కిమళ్లినవి. సరిగ్గా ఇదే వయస్సు ఈ పిల్లలవయస్సే ఉంటుంది తమకు. తనూ తనప్రక్క ఇంటివాళ్లబ్బాయి రామూ, రోజూ సంచిలో పలకా, పుస్తకాలు పట్టుకుని, ఊరికి రెండుమైళ్ళ దూరంలోవున్న స్కూలుకి నడిచి వెళ్లేవారు. మధ్యాహ్నం పూట, అంతదూరం నడిచి ఇంటికి రాలేక, భోజనం టిఫిన్‌లో పెట్టుకుని, కారియర్ భుజానికి తగిలించుకుని వెళ్ళేవారు. మధ్య మధ్యలో రామూ తనకి తెలీని ఎన్నో సంగతులు చెప్పేవాడు. పొరపాటునకూడా తన చేయి వదిలిపెట్టేవాడు కాదు. మధ్య మధ్యలో వచ్చే పిల్లకాలువలని తను ముందు అవలీలగా దాటేసి, తనచేయి పట్టుకుని కూడా దూకించేవాడు. ఆరోజులు ఎంత బాగుండేవి! నిర్మలమైన మనస్సులకల బాల్యం నిజంగా మధురమైనది. ఆరోజులు ఎంతో విలువైనవికూడా. తనకు పదిహేనవఏళ్లు వచ్చేదాకా చదువు చక్కగా సాగిపోయింది. ఆ ఏడే తను వ్యక్తురాలైంది. అంతే—తను మరిక స్కూలు మొహం చూడలేదు. అప్పుడప్పుడు తను అనుకునేది, ఈ స్కూల్ ఫైనల్ చదువు కొంచెం పూర్తిచేస్తే బాగుండును స్కూలుకెళ్ళి - అని, కానీ అది అసంభవం అని ఏనాడో తేలిపోయింది. ఇంట్లోని పెద్దవారినోట ఎప్పుడు విన్నా 'సుజాత పెళ్ళి చేయాలి సుజాత పెళ్ళిచేయాలి' ఇవే మాటలు. అది విని తనకు విసుగెత్తిపోయింది. కానీ గత్యంతరం!—

మొదట్లో రామూ వచ్చి నుంచునేవాడు స్కూలు టైము కాంగానే వాకిట్లోకివచ్చి - ఆ తర్వాత అతను రావటం మానేశాడు. దానికి కారణం ఎవరో తనకు తెలుసు. ఎక్కడైనా కన్పించినా అతను తల దించుకుని వెళ్లిపోయేవాడు. తనకు బొత్తిగా అపరిచితుడల్లే కనుపించేవాడు ఇక తనకు తెలిసింది చదువుని గురించి ఆశపడటం వృథా అని "బడిమాట మరి తలపెట్టకు" అని తలిదండ్రులు చెప్పారు. తననిచదువు మాన్పించినందుకు మొదట్లో కష్ట

(తరువాయి 15 వ పేజీ)

# వాన వెలిసింది

(10వ పేజీ తరువాయి)

కుళ్ళి ఏడ్చింది. మనశ్శాంతికి కట్టె బొట్లని ఏవగించుకుంది. ఆ తరవాత మరి ఆడికూడా చేయలేదు. మౌనమే శరణ్యమయింది తనకు.

స్కూల్ ఫైనల్ చదువు కాంగానే పైచదువులకని రామం తల్లిదండ్రులు మకాం ఎత్తేసి మరో ఊరు వెళ్ళిపోయారు. ఎప్పటికైనా అతన్ని చూడాలని, అతనితో మనసువిప్పి చెప్పాలనీ అనిపించేది. కానీ అది కేవలం వ్యర్థనిరీక్షణే అని తేలిపోయింది. అబల తను అంతకంటే ఏం చేయగలదు? తన కోరికను మనసులోనే అణచివేసుకుంది. తన మనస్సులో మాత్రం రామానికి ప్రత్యేకమైన స్థానం అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ ఏర్పరుచుకునేవున్నది.

ఊసుపోక తను ప్రైవేటుగా చదివి మెట్రిక్ పరీక్షకి కట్టి, అది ప్యాసుఅవటం, వెనువెంటనే మంచి సంబంధం కుదిరి తనకు వివాహం రావటం, అంతా రెండేళ్ళ వ్యవధిలో జరిగిపోయింది. వరుడు 'శ్రీధర్,' ఎం. బి. బి. ఎస్ నాలుగోసంవత్సరం చదువుతున్నాడు; స్ఫురద్రూపి; తనతండ్రి పదివేలు కట్నంఇచ్చి తన బాధ్యత నెరవేర్చుకున్నాడు. భర్త చదువు, హౌస్‌సర్జన్ అయేదాకా తను పుట్టింట్లోనే వుంది. తన భర్తకు గవర్నమెంట్ డాక్టర్‌గా అపాయింట్‌మెంట్ వచ్చింది. ఇంచుమించు ఉద్యోగధర్మంగా ఆంధ్రదేశం అంతా చూచింది, తిరిగింది. తన మనస్సుకు మాత్రం ఎక్కడా సంతోషంలేదు. ఏదో తీరని వెలితి — రోజురోజుకూ అశాంతి తన మనసుని దహించివేస్తున్నది ఎందుకీ ఆవేదన? ఎవరికోసం ఈ నిరీక్షణ?"

తనభర్త డాక్టర్‌గా అసమానఖ్యాతి గడించుకున్నాడు. ఏటువంటి కేసైనా అతడి చేతుల్లోంచి నయం కాకుండా తప్పించుకుని పోలేకపోయేది. తన ఆరోగ్యం గురించి అతడు తీసుకున్న శ్రద్ధ అంతా ఇంతా కాదు. అతడు తన శాయశక్తులా ప్రయత్నించాడు. కానీ, మందులకు మనోవ్యాధి లొంగదుగా. ఫలితం శూన్యమే అయ్యింది. అంతకంతకూ తను కృశించిపోవటం మొదలుపెట్టింది. తన అత్తగారు చాటునా మాటునా 'పెళ్ళినాటికి బంగారు బొమ్మలాగుండేమ్మా. పాడుగ్రహాలు ఏవో పట్టుకుని పీడిస్తున్నయ్యి దీన్ని. ఈ వయసుకి తోడికోడళ్ళంతా ఇద్దరు ముగ్గురు బిడ్డల తల్లులు అవుతున్నారు. ఆ సుభాగ్యం కలిగే యోగ్యత మా [illegible] లేదో' అని గొణుక్కోవటం, పక్కింటి ఇళ్ళ వారితో అంటూండడం తనకి వినిపించకపోలేదు. తన ఆలోచనల్లో, తన బాధల్లో, తన చిన్ననాటి స్నేహితుడు రామం ఇప్పుడు ఎక్కడ వున్నాడు? ఏం చేస్తున్నాడు? వివాహం చేసుకుని వుంటాడా, అసలు తనని గురించి ఇల్లాగే ఆలోచిస్తుంటాడా? తన వివాహం అయిన ఇన్నేళ్ళలో అతను ఒక్కసారి అయినా కన్పడలేదు. ఒక్కసారి అతన్ని చూస్తే తన మనోవ్యధ రవ్వంత తగ్గిపోతుందేమో...

ఆలోచనలలో వున్న తనకి, చీకటి పడటం సన్నని తుంపర తనవంటినీ తలను తడిపేయటం కూడా తెలీలేదు. ఇంతలో కిందనుంచి, తన నౌకరు వచ్చి తమ ఇంటికి ఎవరో అతిథులు వచ్చినట్లు చెప్పి వెళ్ళిపోయాడు. గబగబా గదిలోకివెళ్ళి మొహం కడుక్కుని, తడిబట్టలు విప్పేసి పొడిబట్టలు కట్టుకుని నుదుట కుంకుమ దిద్దుకుని, తడిసిన తలని టవల్‌తో తుడుచుకుంటూ నెమ్మదిగా మెట్లమీదనుంచి కిందకు వచ్చింది. సావిట్లో సోఫాలో ఎవరో అపరిచిత వ్యక్తులు కూర్చుని వున్నారు. ఒక మధ్య వయస్సులోవున్న పురుషుడు అతని ప్రక్కన ఒక అందమైన స్త్రీ, ఇద్దరు ముత్యాల్లాంటి మగబిడ్డలతో కూర్చుని వున్నారు. ఆ వ్యక్తి తనని చూస్తూనే లేచి నించుని, క్షణం సేపు, పాలిపోయి జీవంకోల్పోయినట్లున్న తనముఖం లోకి పరిశీలనగా చూసి నమస్కారం సుజాత గారూ అన్నాడు.

సుజాతకి క్షణం సేపు కళ్ళు తిరిగినట్లయింది. అంతలో తనను తాను సంబాళించుకుని ఆ వ్యక్తికి ప్రతినమస్కారం చేసింది. ఆ కంఠం అదే కంఠం. ఎన్నాళ్ళకిందటో అతి పరిచితమైన ఆ కంఠం తనని ఈ రోజు తిరిగి పల్కరిస్తోంది. ఎవరికోసం తాను ఇన్నాళ్లుగా కలవరిస్తున్నదో, అతడు సతీ సుతుల సమేతంగా తన ఇంటికి వచ్చాడు.

'నన్ను గుర్తుపట్టేశారా? నేను మీ చిన్ననాటి స్నేహితుడు 'రామం'ని. ఈమె నా భార్య 'సీత' — వీళ్ళిద్దరూ నా 'పిల్లలు'. అని పరిచయం చేశాడు. చూడగానే ఆ దాంపత్యం తనకెంతో ముచ్చట గొలిపింది. ఎన్నో కుశలప్రశ్నలు వేసుకున్న తర్వాత రామం చెప్పాడు తనని పోలీసు సూపరింటెండెంటుగా ఆవూరు బదిలీ చేశారని — సముద్రం దగ్గరగా తనకి పెద్దబంగాళా ఇచ్చారనీ — సుజాతకి క్షణంసేపు, రామాన్ని చూస్తే ఎంతో అసూయకలిగింది. ముఖ్యంగా, అతను తనభార్యని గురించీ, ఆమె పిల్లలకిచ్చే క్రమశిక్షణ గురించీ ప్రశంసిస్తున్నపుడూ, మాత్రం అతని ఎడల ఇన్నాళ్ళుగా తనకున్న అభిమానం కొద్దికొద్దిగా సడలచొచ్చింది. ఎంత సేపూ అతడు తన సంభాషణలో, తనభార్య సీత ఆలనాటి శ్రీరాముని భార్య సీతను సాక్షాత్తూ పోలివున్నదని చెప్పినప్పుడు ఇంత కాలంగా తనని ఆవరించుకున్న మత్తు వదలిపోవటం మొదలుపెట్టింది. ఆనాటి రామమేనా ఈ రామం? ఆ నాజూకు ఏదీ ఇతనిలో? మోటుగా బలిష్ఠంగా కండలు తిరిగిన ఆతడి శరీరం పోలీసు ఉద్యోగంలో రాటుతేరినట్లు కనిపించింది బాగా. అయినా అతడెట్లా వుంటే తనకేం? ఆ రామమూ వేరు ఈ రామమూ వేరు. అతనికీ ఇతనికీ పోలికేలేదు.

ఈ రామంకోసమేగా తను ఆలోచనలతో మనస్సుని, బ్రతుకుని బండలు చేసుకుంది! ఇతనిలో ఏం చూసి తను తనభర్తను ఏడిపించుకుతిన్నది ఇన్నాళ్ళూ? భర్తయెడ కలిగిన పశ్చాత్తాపంతో అనుకోకుండా కళ్ళల్లో నీళ్ళు చిప్పిలినవి. ఎవరికీ కనబడకుండా కొనగోటితో నీటిని తుడిచేసుకుంది. తనలాగే, రామంకూడా బాధపడుతూ కృంగిపోతూ, బ్రతుకును పాడుచేసుకుంటాడనుకుంది గానీ, ఇలా మూడుపువ్వులూ, ఆరుకాయలూ కాయిస్తుంటాడనుకోలేదు. ఆలోచనలకు స్వస్తిచెప్పి వంటవాడ్ని కేకేసింది. 'అతిథులకు కాఫీ, ఫలహారాలు తెమ్మని' కానీ రామం వెంటనే లేచి 'వద్దు సుజాతగారూ! ఇంటి దగ్గర ఇప్పుడే నాభార్య నాకిష్టమైన టిఫిన్ చేసింది. అది తిని సరదాగా మిమ్మల్ని చూచి పోదామని వచ్చాము. ఈరోజు మా మేరేజ్

ఇవ్వాళే మేం సినిమా ప్రోగ్రాము వేసు కున్నాం. మరెప్పుడైనా కలుద్దాం' అని లేచి ...ంచుని పిల్లలతో 'అంకుల్‌కి నమస్కారం పెట్టం డమ్మా' అని అన్నాడు మధ్యలోనే ముక్త సరంగా. ఆ పిల్లలిద్దరూ 'అంకుల్ నమస్తే ...' అని చెప్పి వరండాలోకి వెళ్ళి, అప్పుడే ... చేయబోతున్న వాళ్ళనాన్న కారులోకి ఎక్కబోతున్నారు. అతని భార్యకూడా ఎంతో వినయంగా తన దగ్గర సెలవు తీసుకుని వెళ్ళి కారులో కూర్చుంది.

కారు వెళ్ళిపోయిన తర్వాత కేసి చూస్తే, ప్రాణవులా నించున్న సుజాతను భర్త భుజాలు పట్టుకు కదిపి 'ఏమిటా పరధ్యాన్నం సుజాత! ఇంతసేపటినుంచీ, నేను కారు హారన్ మోగి స్తున్నాను వినబడలేదా నీకు? ఇంత పరధ్యాన్న మైతే ఎలా? ఇంట్లో కనక సరిపోయింది ఇదే రోడ్డుమీద ఐతే ఈపాటికి ఏక్సిడెంట్ అయి హాస్పిటల్లో వుండేదానివి' అన్నాడు.

తనకా క్షణంలో భర్త మందలింపు మంద లింపులా అనిపించలేదు. వన్నెచిన్నెలులా అని పించింది. ఆ భర్త మొట్టమొదటిసారిగా తనకు ఎంతో ఆత్మీయుడుగా, అభిమానిగా, దగ్గ రగా, మీదు మిక్కిలి 'అనవరుడు'గా అనిపిం చాడు.

భర్త మందలింపుకి జవాబుగా 'అవును నేను ఇప్పుడే హాస్పిటల్‌నుండి తిరిగి వస్తు న్నాను — నా మనస్సుకి తగిలిన 'ఏక్సిడెంట్' నుంచి కోలుకుని వస్తున్నాను నావంట్లో ఇక ఏమీ జబ్బులేదన్నారు' అని సన్నగా, వినీ, వినబడనట్లుగా గొణిగింది. సుజాత చెప్పిన జవాబేమిటో, ఆమెలో వచ్చిన ఈ ఆకారణపు మార్పుకి కారణమేమిటో భర్తకి అప్పటినుంచీ ఇప్పటికీ అంతుబట్టలేదు.

ఈ మధ్యనే సుజాతని చూచాను. చంటి పిల్లవాడిని ఎత్తుకుని, ఎడపిల్లవాడిని కాన్వెంట్‌కి పంపించటానికి వాకిట్లోకి వచ్చి నించుండి విరిసిన పువ్వులలా వుంది—


We are glad to inform that our Periodical was ncluded for Court Publications by the fol owing District Courts:

1. Proceedings of Dt. Court, West Godawari Eluru' D/ 18-4-1959.
2. Proceedings of District Court, Krishna Machilipatnam, D/ 10 6-1959.
3. Proceedings of Dt. Court, Guntur, No. A1-675/6 Dated 14-12-61.
4. Proceedings of Dt. Judge, Anantapur, by order No 7364/9-8-62.
5. Proceedings of Dt. Court Nellore, dated 9-8-'2.
6. Proceedings of District & Sessions Judge Court, Karimnagar Dis. No. 2727/9-8-62.
7. Proceedings of Dt. & Session Judge, Khammam, Dated 9-4-63.
8. Proceedings of District Judge Chittoor, Dated 10-4-63.
9. Proceedings of District Judge Visakhapatnam, Dated 2-2-65.
10. Proceedings of District Judge, Cuddaph, Dated 2-2-65

Our rate of Column Centimeter is 90 Paise. The Column width is 2¼", and the Type used is 12 Pt.

For other Particulars Please Contact the Manager.